క్లుప్తంగా

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆకస్మిక తనిఖీ



కళ్యాణదుర్గం డిగ్రీ కళాశాలలో రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ డాక్టర్ నాగలింగారెడ్డి

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలను ఆర్‌జేడీ నాగలింగా రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుపై చర్చించారు. అనంతరం కళాశాల ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తప్పని సరిగా కళాశాలకు హాజరు కావాలని విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ జయరామి రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శేషయ్య, అధ్యాపకుడు శ్రీధర్ పాల్గొన్నారు.

ఆయుర్వేద మందుల వాడకంలో అపోహలొద్దు



ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

కంబదూరు: ఆయుర్వేద మందుల వాడుకంలో ఎలాంటి అపోహలు పడాల్సి అవసరంలేదని, రోగానికి సంబంధించిన మందులను వాడి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఆయుర్వేదిక్ వైద్యాధికారి రాధాకుమారి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆయుర్వేదిక్ వైద్యశాలలో 9వ జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహించారు. ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలి

కణేకల్లు: బ్యాంకు రుణాలతోపాటు స్త్రీనిధి రుణాలను జీవనోపాధి కోసం వినియోగించుకొని ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని ఏపీఎం ఎం.ఆంజనేయులు తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రీతి మండల సమైక్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతి మండల సమైక్య అధ్యక్షురాలు వనజ, కార్యదర్శి నూర్జహాన్, ఉపాధ్యక్షురాలు శారదమ్మ, సీసీ గోవిందు, ఎర్రిస్వామి, తిప్పేస్వామి, శివన్న, తిమ్మారెడ్డి, వన్నూరుస్వామి, అకౌంటెంట్ ఎర్రమ్మ పాల్గొన్నారు.

గ్రామైక్య సంఘాలపై ఆడిట్

వజ్రకరూరు: స్థానిక స్త్రీశక్తి భవనంలో మంగళవారం వీఓ గ్రామైక్య సంఘాలపై ఇంటర్నల్ ఆడిట్ నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లోని వీఓ గ్రామైక్య సంఘాలకు సంబంధించి 2024–25 (ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు) స్త్రీనిధి రుణాలు, సీఐఎస్, ఉన్నతి రుణాలు–లావాదేవీలపై ఆడిట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అకౌంటెంట్ నబీరసూల్, వెలుగు ఏపీఓ లలిత, ఎల్‌సీసీలు గోవింద రాజులు, హరినాథ్, మల్లికార్జున, వెలుగు సీసీలు, యానిమేటర్లు తదితరులు ఉన్నారు.


రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కూడేరు: అరవకూరు వద్ద అనంతపురం – బళ్లారి ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురానికి చెందిన భవన నిర్మాణ కార్మికులు కుళ్లాయప్ప, రంగస్వామి గాయపడ్డారు. పని నిమిత్తం వారు అనంతపురం నుంచి ద్విచక్ర వాహనంపై ఉరవకొండకు వెళ్తుండగా, కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి కింద పడ్డారు. క్షతగాత్రులు కూడేరు ఆస్పత్రిలో చికిత్స పొందారు.

బాలిక అదృశ్యం

కంబదూరు: చెన్నంపల్లికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ఎస్సీకాలనీకి చెందిన ఆ బాలిక.. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటి నుంచి వెళ్లిపోయింది. అర్ధరాత్రి తల్లిదండ్రులు లేచి చూడగా బాలిక కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సమన్వయంతోనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దార్ షర్మిల

బెళుగుప్ప: మండలంలో నెలకొన్న సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే పరిష్కారం లభిస్తుందని ఎంపీపీ పెద్దన్న, తహసీల్దార్ షర్మిల పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయం, వైద్యం, పశుసంవర్ధక, విద్యుత్, ఐసీడీఎస్ తదితరశాఖల అధికారులు మాట్లాడారు. ఆర్‌అండ్‌బీ నిధుల ద్వారా రూ. 80 లక్షలతో బెళుగుప్ప నుంచి రామసాగరం, సల్లాపురం, గుండ్లపల్లి, గొల్ల గ్రామాల రహదారులకు మరమ్మతులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పుష్పావతి, ఎంఈఓ మల్లారెడ్డి, ఏఓ దామోదర్, అగ్రికల్చర్ ఏఓ పృథ్వీసాగర్, వివిధ శాఖల అధికారులు సర్పంచులు, ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్ తదితరులు పాల్గొన్నారు.

వాతావరణంలో చోటుచేసుకుంటున్న అనేక మార్పులతో మిర్చి పంటపై నల్లతామర (నల్లి) పంజా విప్పుతుంటే.. వరి పైరుపై సుడిదోమ, కంకినల్లి.. అగ్గి తెగులు, ఎర్ర తెగులు విజృంభిస్తున్నాయి. మొక్కజొన్నలో కత్తెర, పత్తిలో పిండినల్లి లాంటి తెగుళ్లు చుట్టుముట్టాయి. టమాట, ఉల్లి, వంకాయ, పచ్చి మిరప, కూరగాయాలతో పాటు పండ్ల తోటల్లోనూ వైరస్ ఉధృతంగా పట్టింది. వాటిని కట్టడి చేసేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ప్రధానంగా బ్యాడిగి రకం మిర్చి రైతులు అధికంగా నష్టపోతున్నారు. నల్లతామర వైరస్‌కు సరైన మందు తెలియక.. విచ్చలవిడిగా పురుగు మందులు పిచికారీ చేస్తూ రైతులు అనేక రకాలుగా నష్టపోతున్నారు.

– రాయదుర్గం:

నకిలీ మందులు.. నట్టేట ముంచున్!



- మార్కెట్లో విచ్చలవిడిగా నాణ్యతలేని పురుగు మందుల విక్రయం
- వైరస్ ఒకటైతే.. మందు మరొకటి ఇస్తూ దుకాణదారుల దోపిడీ
- అవగాహన లేక నష్టపోతున్న అన్నదాతలు
- తనిఖీల్లోనూ గుర్తించని అధికారులు అధికంగా నష్టపోతున్న మిర్చి రైతులు

» గుమ్మఘట్ట మండలంలోని ఓ గ్రామానికి చెందిన కౌలురైతు మూడెకరాల్లో బ్యాడిగి మిర్చి సాగు చేశాడు. గత కొన్నేళ్లుగా పలు రకాల వైరస్‌లతో సతమతమయ్యే ఈ రైతుకు ఈ ఏడాది ఆకుముడత (నల్లి) అనే కొత్త రకం వైరస్ పంటను ఆశించింది. పూత, కాయ పట్టే సమయానికి తెగుళ్ల బెడద అధికమైంది. ఎలాగైనా పంటను రక్షించుకోవాలనే క్రమంలో పురుగు మందుల దుకాణ యజమానులు చెప్పినట్లు ఎకరాకు రూ.70 వేలకుపైగా వెచ్చించి, పలు రకాల మందులు పిచికారీ చేశారు. అయితే ఏమాత్రం మార్పు కనిపించక పోవడంతో పంట తుడిచిపెట్టుకుపోయే పరిస్థితి వచ్చింది.

» హెచ్ఎల్‌సీ పరిధిలో ఓ రైతు వరి పైరులో దోమ నియంత్రణ కోసం పలు కంపెనీలకు చెందిన పురుగు మందు పిచికారీ చేశారు. తెగుళ్ల తీవ్రత కాసింతైనా తగ్గలేదు. వినియోగించిన పురుగు మందు డబ్బాల్లోని కొన్ని కల్తీవి అని తేలింది. దీంతో రైతులు ఆందోళన చెందారు. రూ.లక్షలు వృథాగా పోసినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా.. ఈ ఇద్దరు రైతులే కాదు.. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉవరకొండ నియోజకవర్గాల్లోని చాలా మంది రైతులు ఈ తరహా సమస్యలే చవిచూస్తున్నారు.

వైరస్ ఒకటయితే.. మందు మరొకటి..:
రైతు అవసరాల దృష్ట్యా మార్కెట్లో పలు రకాల పురుగు మందులు పుట్టుకొచ్చాయి. వైరస్ ఒకటైతే మందు మరొకటి దుకాణదారులు అంటగట్టేస్తున్నారు. కొందరు ప్రైవేట్ సిబ్బందిని నియమించుకుని క్షేత్రస్థాయిలోకి పంపుతున్నారు. తెలిసి తెలియని వారే శాస్త్రవేత్తలుగా చెలామణి అవుతున్నారు. పంటకు ఏ పురుగు మందు వాడాలో తేల్చేస్తున్నారు. దుకాణం వద్దకు పంపి, కొనుగోలు చేసేలా రైతులు నమ్మిస్తున్నారు. పురుగు మందులు ఎన్ని పిచికారీ చేసినా నల్లతామర ఆశించడం వల్ల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని సుమారు 44 వేల ఎకరాల్లో బ్యాడిగి మిరప, 14,800 హెక్టార్లలో వరి, సుమారు 4 వేల హెక్టార్లలో పత్తి, 6వేల హెక్టార్లలో మొక్కజొన్న, వేలాది ఎకరాల్లో పండ్ల తోటలు, కూరగాయాల సాగు చేపట్టారు. తెగుళ్ల దాడి నుంచి పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు తల్లడిల్లుతున్నారు.

కొంపముంచుతున్న ధరలు..
రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లోని సుమారు 200 వరకు పురుగు మందుల దుకాణాలు పుట్టుకొచ్చాయి. చాలా దుకాణాల్లో



అప్పుగా కావాల్సిన పురుగు మందులు అందిస్తున్నారు. దీంతో మిర్చి రైతులు రూ.లక్షల్లోనే ఖాతా పెట్టేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు అధిక ధరలు వసూలు చేస్తున్నట్టు సమాచారం. దీనికితోడు పురుగు మందుల వ్యాపారంలో దళారుల ప్రమేయం అధికంగా కనిపిస్తోంది. డిమాండ్ మేరకు కొన్నిచోట్ల నాణ్యతలేని పురుగు మందులు మార్కెట్లోకి వస్తున్నట్టు ప్రచారం సాగుతోంది. తనిఖీల సమయంలో అధికారులు వీటిని గుర్తిస్తే కట్టచేయొచ్చు.

అదుపులోకి రాని 'తామర'..
ఇతర రాష్ట్రాల నుంచి ఏపీలోకి నాలుగేళ్ల క్రితం ప్రవేశించిన నల్లతామర పురుగు నివారణకు ఎన్ని మందులు పిచికారీ చేసినా అదుపులోకి రాని పరిస్థితి. ఇది తెలిసినా చాలా మంది రైతులు మిర్చిపై మక్కువ చావక విచ్చలవిడిగా పురుగు మందులు వినియోగిస్తూ నష్టాల ఊబిలో చిక్కుకుంటున్నారు. ఒకే కంపెనీకి చెందిన రసాయనాన్ని వెనువెంటనే వినియోగిస్తే పురుగుల నిరోధక శక్తిని పెంచుకుని పుంజుకోవడంతో దాని శక్తి పలుచబడి పోతుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయాధికారులు సూచించిన మందులనే పిచికారీ చేసుకోవడం ఉత్తమం.

రైతులను మోసగిస్తే చర్యలు

తామర పురుగు నివారణ పేరుతో ఇష్టారాజ్యంగా పురుగు మందులు అంటగడితే కఠిన చర్యలు ఉంటాయి. వైరస్ ఏదైనా సరే కట్టడి చేసే మార్గం ఉంది. దళారులు, ప్రైవేట్ వ్యక్తుల మాటలు నమ్మి మోసపోరాదు. పురుగు మందు పిచికారీ చేసే విధానం తెలుసుకోవాలి. ఎవరు ఏది చెప్పితే దాన్ని వినియోగిస్తే వైరస్ మరోవిధంగా రూపాంతరం చెందుతుంది. కట్టడి చేయడానికి కూడా కష్టంగా మారుతుంది. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనల మేరకే మందులు వినియోగించాలి. ముఖ్యంగా బిల్లులు లేకుండా ముందులు కొనుగోలు చేయరాదు. నకిలీ, నాణ్యతలేని మందులు ఎక్కడా గుర్తించలేదు. రైతుల్లో ఆ అపోహ తొలగి వాడుక పద్ధతిని తెలుసుకోవాలి.

– ఉమామహేశ్వరమ్మ, డీపీఓ, అనంతపురం

కందిపంటలో మెలకువలు పాటించండి



గూళ్యపాళ్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ మధుకర్

వజ్రకరూరు: కందిపంటలో మెలకువలు పాటించి, మంచి దిగుబడులు సాధించాలని ఏఓ మధుకర్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గూళ్యపాళ్యం గ్రామంలో 'పొలంపిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం కందిపంట పూతదశలో ఉందని, రైతులు తగు జాగ్రత్తలు పాటించి పంటను చీడపురుగుల నుంచి కాపాడుకోవాలని సూచించారు. ప్రస్తుతం కందిలో మారు కామచ్చల పురుగు, శనిగ పచ్చ పురుగు, తెల్లదోమ, పచ్చ దోమ ఆశిస్తున్నట్లు తెలిపారు. తెగులు సాధారణంగా ఉన్నట్లయితే క్లోరిపైరిపాస్, 20 ఈసీ–1.5 ఎంఎల్ ఒక లీటరు, హెక్సాకొన జోల్ 2 ఎంఎల్– ఒక లీటరు నీటికి వాడుకోవాలన్నారు. మధ్యస్థం ఉంటే ఎమామెక్టిన్, బెంజీమోట్ 0.5 గ్రాముల ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రాజేష్, రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి హ్యామర్ పోటీలకు ఎంపికయిన వరుణ్‌కుమార్‌తో ఉపాధ్యాయులు

బెళుగుప్ప: మండలంలోని నరసాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం బాలాజీ, పీడీ అమర్‌నాథ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వరుణ్‌కుమార్ ఈనెల 28న అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి హ్యామర్ త్రో అండర్ –17లో ఉత్తమ ప్రతిభతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. నవంబర్‌లో శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అభిరాం అనంతపురంలో ఈనెల 26న జరిగిన పవర్ లిఫ్టింగ్ జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభతో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చాబాల విద్యార్థిని



విద్యార్థిని రోహిత

వజ్రకరూరు: మండలంలోని చాబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థిని రోహిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యింది. మంగళవారం జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాలలో జరిగిన అండర్ 17 విభాగం ఖోఖో పోటీల్లో ప్రతిభ చూపి, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యింది. నవంబర్ 2,3,4 తేదీల్లో అనకాపల్లిలో రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయి. సర్పంచు మల్లెల జగదీష్, హెచ్ఎం నాగేంద్రప్ప,పీడీ లక్ష్మీప్రసాద్, గ్రామస్తులు విద్యార్థినిని అభినందించారు.

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ట

కూడేరు: మండలంలోని ముద్దలాపురంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయం ముందు మంగళవారం ధ్వజ స్తంభ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద దీక్ష, మూలమంత్ర, ఆదివాస హోమాలను వేద పండితులు నిర్వహించారు. సాయంత్రం 108 కలశాలతో కలశ పూజ చేశారు. అనంతరం మహా మంగళ హారతి ఇచ్చారు. బుధవారం వేకువజామున ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట, అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు, గ్రామ పెద్దలు తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ఇంత నిర్లక్ష్యమా?

- ఎంఈఓ, హెచ్ఎంపై ఆర్డీఓ శ్రీనివాసులు అసహనం



ఆదర్శ పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

కూడేరు: ఎంఈఓ కార్యాలయం పక్కనే ఉన్న ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు తాగడానికి మంచి నీరు అందించకపోతే ఎలా..? విద్యార్థుల ఆరోగ్యంపై ఇంత నిర్లక్ష్యమా? అని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు ఎంఈఓ మహమ్మద్ గౌస్, హెచ్ఎం శాంతీవాణిని ప్రశ్నించారు. కూడేరులోని ఆదర్శ పాఠశాల, హైస్కూల్, కమ్మూరు, కొర్రకోడు పాఠశాలల్లో నాడు–నేడు పనుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఫిర్యాదులు రావడంతో తహసీల్దార్ మహబూబ్ బాషాతో కలిసి ఆర్డీఓ మంగళవారం రాత్రి కూడేరులోని హైస్కూల్, ఎమ్మార్సీ ఆవరణలోని ఆదర్శ పాఠశాలను తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, గదుల నిర్మాణం, తాగునీటి సరఫరా, ఆర్‌ఓ ప్లాంట్ తదితర వాటిని పరిశీలించారు. ఆదర్శ పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్ పనిచేయక ఆరు నెలలు అవుతోందని హెచ్ఎం శాంతీవాణి చెప్పడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంఈఓ మహమ్మద్ గౌస్ , వీఆర్వో రమేష్ పాల్గొన్నారు.

వైద్యసేవలు ప్రజలకు మరింత చేరువచేయాలి



ప్రభుత్వాస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న ఎన్‌సీడీసీడీ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణస్వామి

వజ్రకరూరు: వైద్యసేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ఎన్‌సీడీసీడీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణస్వామి సూచించారు. మంగళవారం మండల కేంద్రం వజ్రకరూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎన్‌సీడీసీడీ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ స్వామి సందర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. అనంతరం రోగులతో మాట్లాడారు. ఎస్‌సీడీసీడీ ప్రోగ్రాం ఆఫీసర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి శనివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు స్క్రీనింగ్ నిర్వహించాలన్నారు. వైద్యాధికారి సర్దార్‌వలి, ఆరోగ్య విస్తరణ అధికారి గురు ప్రసాద్ , సూపర్‌వైజర్‌లు నాగశంకర్, సుశీలమ్మ, ఏఎస్ఎంలు సుకన్య పాల్గొన్నారు.

సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం తగదు



సమావేశంలో సమస్యలపై అడుగుతున్న సభ్యులు

శెట్టూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం తగదని ఎంపీపీ లక్ష్మీదేవి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. డీఎల్‌డీఓ నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో ముందుగా గత సమావేశంలో చర్చించిన సమస్యలు– వాటి పరిష్కారంపై చర్చించారు. అందులో భాగంగా పలు గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని, గత సమావేశంలోనే సభ దృష్టికి తీసుకొచ్చిన ఇప్పటి వరకూ నూతన ప్రభుత్వం కూడా పరిష్కారించలేదని ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. పాడి రైతుల కోసం మినీ గోకులాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిన సమాచారం గ్రామాల్లో తెలియదన్నారు.పచ్చనేతలకు మాత్రమే సమాచారం ఇచ్చి దరఖాస్తులు చేయించారన్నారు. రైతులు దరఖాస్తులు చేస్తే రైతులకు తెలియకుండా వాటిని అధికారులు తొలగించారని ఉపాధి హామీ,పశు శాఖ అధికారులను సభ్యులు నిలదీశారు.

సర్పంచులకు బిల్లులు పెట్టడడం లేదు.. : సమావేశానికి హాజరైన గ్రామ సర్పంచులు గత ఆరు నెలలుగా గ్రామాల్లో నిర్వహించిన అభివృద్ధి పనులకు, తాగునీటి సమస్య పరిష్కార పనులకు బిల్లులు చెల్లించలేదని సర్పంచులు (వైఎస్సార్‌సీపీ) అన్నారు. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోతే గ్రామాల్లో సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాఘురాం రావు, ఏడీఐ ఎల్లప్ప, వైస్ ఎంపీపీ చెవులకిష్టప్ప, సర్పంచులు సత్యనారాయణరెడ్డి, ఈరన్న, వెంకటేశులు, ప్రకాష్, పాలయ్య, విరుపాక్షి,చిట్టెమ్మ, గంగన్న, నాగరాజు, ఎంపీటీసీలు నాగమణి, నరసింహులు, పవిత్ర పాల్గొన్నారు.

బడ్జెట్లో సాగునీటికి రూ.10 వేల కోట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేంద్రకుమార్

రాయదుర్గంటౌన్: జిల్లాలో సాగునీటి కోసం నవంబర్‌లో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సమైక్యాంధ్ర భవనంలో రాయదుర్గం, కణేకల్లు, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్ మండలాల సీపీఎం నాయకులతో ప్రాంతీయ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రప్రసాద్‌తోపాటు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున మాట్లాడారు. జిల్లాలో పండిస్తున్న పంటలకు సకాలంలో సాగునీరు అందక నష్టపోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. తుంగభద్ర జలాశయంలో అవసరమైన నీరు ఉన్నా వినియోగించుకోవడంలో జిల్లా పాలకులు, అధికారులు విఫలమవుతున్నట్లు చెప్పారు. ఆధునీకీకరణ పనులు సకాలంలో పూర్తికాక ఆయకట్టు రైతులు తమ పంటలకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నట్లు ధ్వజమెత్తారు. రాయదుర్గం ప్రాంతంలో సాగు, తాగునీరు, ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం రానున్న రోజుల్లో సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం రాయదుర్గం, కణేకల్లు, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్ మండలాల ప్రాంతీయ కమిటీ కన్వీనర్‌గా బి.మల్లికార్జున, కమిటీ సభ్యులుగా మధు, శివ, తిమ్మరాజు, లోకేష్, మల్లికార్జున, నాగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసులు, సీనియర్ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణం చెల్లించాలి



రాయదుర్గం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న విద్యార్థులు

రాయదుర్గంటౌన్: విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌కు విద్యార్థులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు పట్టడంలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ అన్నారు. ఇచ్చిన హామీ మేరకు జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, పెండింగ్ వసతి, విద్యా దీవెన నిధులు విడుదల చేయాలనే డిమాండ్లతో మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ చేసి తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి, ధర్నా చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు పరమేష్, బంగిశివ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తామని చెప్పిన మంత్రి.. ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. డిగ్రీ, ఇంజనీరింగ్, బీఫార్మసీ విద్యార్థుల పెండింగ్ ఫీజులను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కళ్లు తెరవకపోతే నవంబర్ 6న చలో కలెక్టరేట్ చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వలి, గౌతమ్, అరవింద్, జీవన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు,ప్రజా సంక్షేమంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

కూడేరు: కూటమి ప్రభుత్వం ప్రజా, రైతు సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఓ.నల్లప్ప ధ్వజమెత్తారు. మంగళవారం కూడేరులోని సీపీఎం కార్యాలయంలో మండల సభ జరిగింది. పార్టీ భవిష్యత్ కార్యాచరణ, మండల ప్రజా, రైతు సమస్యలపైన ఆయన మండల నాయకులతో చర్చించారు. అనంతరం పార్టీ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా కరీం సాబ్, సహాయ కార్యదర్శిగా వెంకటేశులు, సభ్యులుగా చాకలి మల్లికార్జున, రాధాకృష్ణ, పెద్దన్న, చిన్నా, చిదంబరమ్మ, లక్ష్మీదేవి, అలివేలమ్మను ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి మద్యంపై ఉన్న ధ్యాస, ప్రజా, రైతు సంక్షేమంపై లేదన్నారు. వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతే పట్టించుకోలేదన్నారు. ప్రాజెక్టులు, చెరువులను నీటితో నింపి ఆయకట్టుకు సాగు నీరందించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ప్రజా, రైతు సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రభుత్వంతో పోరాటాలు చేసి, పరిష్కార మార్గం చూపేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమూర్తి , మండల నాయకులు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటరు జాబితా విడుదల



ముసాయిదా ఓటర్ల జాబితాను ఈడీటీ సుజాతకు అందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

రాయదుర్గంటౌన్: జిల్లా వ్యాప్తంగా ఓటర్ల జాబితా 2024–25 ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ మంగళవారం విడుదల చేశారు. ఈ మేరకు రాయదుర్గం నియోజకవర్గం ముసాయిదా ఓటర్ల జాబితా వివరాలను ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సుజాత వెల్లడించారు. ఓటర్ల జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించనున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు బీఎల్వోలు ఇంటింటా సర్వే నిర్వహించినట్లు చెప్పారు. వృత్తిదారులు, మృతులు, వలస ఓటర్ల తొలగింపుతోపాటు 2025 జనవరి 1 నాటికి అర్హులైన వారిని నుంచి కొత్తగా ఫారం 6 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఇందుకు అనుగుణంగా ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసినట్లు తెలిపారు. డిసెంబర్ 24 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని, 2025 జనవరి 6న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు చెప్పారు. గతంలో కంటే ప్రత్యేక సవరణ ఓటర్ల జాబితాలో నియోజకవర్గంలో 3,150 మంది ఓటర్లు పెరిగారు. ఏప్రిల్ 30 నాటికి 2,60,859 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం 2,64,009 ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళా ఓటర్లు 1,33,409 మంది, పురుష ఓటర్లు 1,30,558 మంది ఉండగా థర్డ్‌జెండర్ ఓటర్లు 42 మంది ఉన్నారు .

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం నియోజకవర్గం – 154 ముసాయిదా ఓటరు జాబితాను ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీఓ వసంతబాబు విడుదల చేశారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేశారు. కొత్తగా ఓట నమోదుకు ఫారం–6, తొలగింపులు ఫారం–7, ఓటరు జాబితాలో సవరణలు, మార్పులకు ఫారం–8 ద్వారా చేసుకోవాలని ఆర్డీఓ సూచించారు. ముసాయిదా ఓటరు జాబితాలు ఆయా మండలాల బూత్ లెవల్ అధికారులతో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు తమ ఓటును పరిశీలించుకోవాలన్నారు.

మండలాల వారీగా ముసాయిదా జాబితా ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
డి.హీరేహాళ్	18,353	18,446	4	36,803
బొమ్మనహాళ్	23,191	23,427	13	46,631
కణేకల్లు	26,131	26918	6	53,055
రాయదుర్గం రూరల్	17,133	17,388	3	34,524
రాయదుర్గం అర్బన్	25,695	27565	16	53,276
గుమ్మఘట్ట	20,055	19,665	0	39,720
మొత్తం	1,30,558	1,33,409	42	2,64,009

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఓటరు జాబితా వివరాలు..

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
బ్రహ్మసముద్రం	17,464	17,335	1	34,800
కళ్యాణదుర్గం (అర్బన్)	17,531	18,891	2	36,424
కళ్యాణదుర్గం (రూరల్)	19,348	19,351	2	38,701
శెట్టూరు	17,186	17,236	1	34,423
కుందుర్పి	21,960	22,032	0	43,992
కంబదూరు	21,114	21,794	1	42,909
మొత్తం	11,4603	11,6639	7	2,31,249